www.prajasakti.com

ప్రజాశక్తి

శనివారం 6 ఏప్రిల్ 2023

5

పశ్చిమ గోదావరి




పంట నష్టపోయిన రైతులను ఆదుకోవాలి : సిపిఎం

భీమవరం :అకాల వర్షాల వల్ల పంట నష్టపోయిన రైతులను ఆదుకోవాలని సిపిఎం జిల్లా కార్యదర్శి బి.బలరాం డిమాండ్ చేశారు. స్థానిక సుందరయ్య భవనంలో సిపిఎం జిల్లా కమిటీ సమావేశం సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు చింతకాయల బాబూరావు అధ్యక్షతన శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా బలరాం మాట్లాడుతూ మాసూళ్లకు వచ్చిన పంట, ధాన్యం రాశులు తీవ్రంగా దెబ్బతిన్నాయన్నారు. సకాలంలో తగినన్ని సంచులు, మాసూళ్లకు వచ్చిన ధాన్యం కొనుగోలుకు ఏర్పాట్లు చేయకపోవడం, వాహనాలు సమకూర్చకపోవడం, నిబంధనలు, షరతులు పెట్టి కొంత మేర కొనుగోలుకు మాత్రమే ప్రభుత్వం ప్రయత్నించిందన్నారు. రంగు మారిన, తడిసిన ధాన్యాన్ని నిబంధనలు సడలించి మద్దతు ధరకు ప్రభుత్వమే తక్షణం కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. నష్టపోయిన రైతులకు నష్టపరిహారం అందించాలన్నారు. నూక శాతంఎక్కువగా ఉందనే పేరుతో డబ్బు వసూలు చేయొద్దని డిమాండ్ చేశారు. ఉపాధి కూలీలకు పని దినాలు, వేతనం పెంచాలని డిమాండ్ చేశారు. ఉద్యోగులు, ఉపాధ్యాయులు, వృత్తిదారులు, రైతులు, కౌలు రైతుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు.

ధాన్యం..గట్టెక్కేదెలా..!

తుపాను హెచ్చరికలతో రైతుల్లో ఆందోళన
కన్నీటి సంద్రంలో అన్నదాత
సంచుల్లేక కల్లాల్లోనే ధాన్యం
వర్షాలకు తడిసి, మొలకలొస్తున్న పరిస్థితి
రైతులకు రాజకీయాలు ఆపాదించి ఇవ్వని సంచులు
యథేచ్ఛగా మిల్లర్ల దోపిడీ
ఉమ్మడి పశ్చిమలో 50 శాతం ధాన్యం కల్లాల్లోనే



ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

'నా పేరు సంపతి వెంకటేశ్వకరావు. మాది కైకరం గ్రామం. 11 ఎకరాలు కౌలుకు తీసుకుని వరి సాగుచేశాను. గతనెల 22న మాసూలు పూర్తిచేశాను. కానీ ఇప్పటి వరకూ సంచులు ఇవ్వలేదు. వర్షాలకు ధాన్యం తడిసి మొలకలు వస్తున్నాయి. రైతులకు రాజకీయాలు ఆపాదించి సంచులు ఇవ్వకుండా చేస్తున్నారు. ధాన్యాన్ని ఏ విధంగా గటెక్కించాలో తెలీయడం లేదు.'

'నా పేరు సానం ఏడుకొండలు. మాది కైకరం. పదెకరాలు కౌలుకు తీసుకుని వరి సాగుచేశాను. గతనెల 18న మాసూలు చేశాను. ఇంకా 500 సంచుల్లేక అలానే ఉండిపోయాయి. వర్షాలకు తడిసి ధాన్యం మొలకలు వస్తున్నాయి. ధాన్యం కాపాడుకునేందుకు నానా ఇబ్బందులు పడాల్సి వస్తోంది. ఎప్పటికి ధాన్యం వెళ్తుందో తెలియడం లేదు.'

పైన పేర్కొన్న సమస్యలను ఎదుక్కొంటున్నది వెంకటేశ్వరరావు, ఏడుకొండలు మాత్రమే కాదు.. ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాల్లో వరిసాగుచేసిన వేలాది మంది రైతులది ఇదే పరిస్థితి. మాసూలు చేసిన కల్లాలో ఉన్న ధాన్యం అమ్ముకునేందుకు సంచుల్లేక, లారీలు లేక నానా అవస్థలు పడుతున్నారు. మాసూలు చేసి 20 రోజులు గడస్తున్నా ఇప్పటికీ సంచులు ఇవ్వని పరిస్థితి కొనసాగుతోంది. ధాన్యం కొనుగోలులో నూతన విధానం అస్తవ్యస్తంగా తయారైంది. సంచులు, లారీల విషయంలో అధికారులు పూర్తిగా చేతులెత్తేశార. దీంతో రైతులు గందరగోళానికి గురవుతున్నారు. బంగాళాఖాతంలో పొంచి ఉన్న తుపాను హెచ్చరికలతో రైతులు మరింత ఆందోళనకు గురవుతున్నారు. ఈ నెల తొమ్మిదో తేదీకి అల్పపీడనం తుపానుగా మారనున్నట్లు చేస్తున్న హెచ్చరికలు రైతులకు కంటిమీద కునుకులేకుండా చేస్తున్నాయి. ఏలూరు జిల్లాలో 79వేల ఎకరాలు, పశ్చిమలో 2.13లక్షల ఎకరాల్లో రైతులు వరిసాగుచేశారు. ఏలూరు జిల్లాలో 3.90 లక్షల మెట్రిక్ టన్నులు, పశ్చిమలో 9.28 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి వస్తుందని అంచనా వేశారు. రెండురోజుల క్రితం అధికారులు విడుదల చేసిన లెక్కల ప్రకారం చూస్తే ఇప్పటి వరకూ పశ్చిమలో 2.30 లక్షల మెట్రిక్ టన్నులు, ఏలూరులో 1.15 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేశారు. అంటే రెండు జిల్లాల్లో కలిపి 3.50 లక్షల మెట్రిక్టన్నుల ధాన్యం మాత్రమే కొనుగోలు చేశారు. అధికారుల లెక్కల ప్రకారం చూస్తే ఇంకా దాదాపు ఎనిమిది లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేయాల్సి ఉంది. దాదాపు 50 శాతంపైగా ధాన్యం కల్లాల్లోనే ఉండిపోయింది. లారీలు, సంచులు అందిచడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైంది. మంత్రులు, ఎంఎల్ఎలు రైతుల వంక కనీసం చూడటం లేదు. రైతులకు రాజకీయాలు ఆపాదించి సంచులు ఇవ్వడం లేదంటూ పలువురు రైతులు గగ్గోలు పెడుతున్నారు. రైతులకు రాజకీయాలు ఆపాదించడం ఏమిటో కూడా అర్థంకావడంక లేదు.

ఆరబెట్టకపోతే మొలకలు.. ఆరబెడితే వర్షం

వారంరోజులుగా వర్షం రైతులను వెంటాడుతోంది. ప్రతీరోజు ఏదో ఒక సమయంలో వర్షం పడుతూనే ఉంది. దీంతో రైతుల పరిస్థితి దారుణంగా మారింది. వర్షాలకు తడిసిన ధాన్యం అరబెట్టకపోతే మొలకలు వస్తున్నాయి. ఆరబెడితే వర్షానికి మళ్లీ తడిసిపోతుంది. ఆరబెట్టిన తర్వాత వర్షం వస్తే ధాన్యం మళ్లీ రాశులుగా చేయడం చాలా కష్టం. దీంతో రైతులకు ఏంచేయాలో అర్థంకాక తలలు పట్టుకుంటున్నారు. ఉంగుటూరు మండలం నాచుగుంట, కైకరం వంటి గ్రామాల్లో ఇప్పటికే తడిసిన ధాన్యం మొలకలు రావడంతో రైతులకు దిక్కుతోచని పరిస్థితి నెలకొంది.

రవాణాకు లారీలు రావడం లేదని, సంచులు ఇవ్వడం లేదని రైతులు మొత్తుకుంటున్నా ఏ ఒక్కరికీ పట్టడం లేదు. గతనెల 16వ తేదీన ధాన్యం కొనుగోలు ప్రారంభించారు. 20 రోజులు దాటుతున్నప్పటికీ సమస్యలు పరిష్కారంకాలేదు. మిల్లర్లు పెడుతున్న ఇబ్బందులు అన్నీఇన్నీకావు. ముక్క పేరుతో పెద్దఎత్తున డబ్బులు వసూలు చేస్తున్నారు. ఖరీఫ్లో తేమపేరుతో రైతుల నుంచి దోచేసిన మిల్లర్లు, రబీలో ముక్క పేరుతో దోపిడీ చేస్తున్నారు. మిల్లర్లను ప్రభుత్వం అదుపుచేయలేని పరిస్థితి నెలకొంది. ఈనెల మొదటివారం గడిచిపోతున్నా ఇంకా కల్లాల్లోనే ధాన్యం ఉండిపోవడంతో, వర్షాలతో పంట గట్టెక్కేదెలా అంటూ అన్నదాతలు మదనపడుతున్నారు.



నివాళులర్పిస్తున్న నాయకులు

కార్ల్మార్క్స్ జీవితం ప్రపంచానికి ఆదర్శం

సిపిఎం జిల్లా కార్యదర్శి బలరాం

ప్రజాశక్తి - భీమవరం

కమ్యూనిస్టు సిద్ధాంతకర్త, పీడిత ప్రజల విముక్తి కోసం శ్రమించిన కార్ల్ మార్క్స్ జీవితం నేటి తరానికి ఆదర్శప్రాయమని సిపిఎం జిల్లా కార్యదర్శి బి.బలరాం అన్నారు. స్థానిక పుచ్చలపల్లి సుందరయ్య భవనంలో మార్క్స్ జయంత్యుత్సవం శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మార్క్స్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం బలరాం మాట్లాడుతూ ప్రపంచ ప్రఖ్యాత మేధావి, మహోన్నత వ్యక్తి కార్ల్మార్క్స్ అని కొనియాడారు. ప్రపంచ పీడిత ప్రజల విముక్తి కోసం తన మిత్రుడు ఎంగెల్స్ సహకారంతో సిద్ధాంతాన్ని రచించారన్నారు. దీనినే మార్క్సిజం అని నేడు మనం పిలుస్తున్నామన్నారు. కార్మిక వర్గం దోపిడీకి ఎలా గురవుతుంది, బడా పారిశ్రామికవేత్తలు, పెట్టుబడి దారులు కలిసి శ్రామికులను ఎలా దోచుకుం టున్నారు, కార్మికులు ఎలా విముక్తి సాధించాలి, ఒకే గొప్ప సోషలిస్ట్ సమాజాన్ని ఎలా నిర్మించవచ్చు అని ఎంగెల్స్తో కలిసి కమ్యూనిస్టు ప్రణాళిక రచించారని తెలిపారు. పెట్టుబడి గ్రంథం ద్వారా పెట్టుబడిదారీ విధానం యొక్క అవలక్షణాలను, కార్మికవర్గం పడుతున్న కష్టాలను, ప్రజలు, కార్మికులు ఎలా ఆర్థిక దోపిడీకి గురవు తున్నారనే విషయాలను తెలిపారన్నారు. పెట్టుబడి గ్రంథం అత్యంత ప్రాచుర్యం పొందిన గ్రంథంగా అవతరించిందన్నారు. మార్క్స్, ఎంగెల్స్ తరువాత సోవియేట్ విప్లవానికి నాయకత్వం వహించిన లెనిన్ ఈ సిద్ధాంతాన్ని మరింత అభివృద్ధి చేశారన్నారు. అందుకనే మార్క్సిజం - లెనినిజంగా నేడు ప్రపంచవ్యాప్తంగా కీర్తించబడుతుందన్నారు. కార్ల్ మార్క్స్ తన జీవితంలో అనేక కష్ట నష్టాలను ఎదుర్కొన్నారన్నారు. ధనవంతుల కుటుంబంలో పుట్టినా శ్రామిక ప్రజల విముక్తి కోసం అనేక కష్టాలను అనుభవించారన్నారు. అనేక దేశాల పాలక వర్గాలతో బహిష్కరణకు గురయ్యారన్నారు. మార్క్స్ సహచరిణి జెన్నీ కూడా మార్క్స్ కష్టాల్లో పలు పంచుకున్నారని తెలిపారు. కన్నబిడ్డలు కళ్ల ముందే మరణించిన ఘటనలు మార్క్స్ జీవితంలో ఉన్నాయన్నారు. అయినప్పటికీ మొక్కవోని దీక్షతో, శ్రామిక వర్గ సిద్ధాంతం కోసం, శ్రామిక వర్గ విముక్తి, సోషలిజం నిర్మాణం కోసం తన యావజ్జీవితాన్ని అంకితం చేశారన్నారు. మార్క్స్ కన్న కలలు నిజం చేసేందుకు అందరం పునరంకితమవుదామని బలరాం అన్నారు. ఈ సమావేశంలో జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు జెఎన్వి.గోపాలన్, చింతకాయల బాబూరావు, కర్రి నాగేశ్వరరావు, బి.వాసుదేవరావు, పివి.ప్రతాప్, సీనియర్ నాయకులు జుత్తిగ నరసింహమూర్తి, జిల్లా కమిటీ సభ్యులు ఎం.వైకుంఠరావు, ఎ.అజయకుమారి, తవిటి నాయుడు, జార్జి, బాలరాజు, జె.శ్రీనివాస్, డి.శ్రీనివాస్, జి.రామకృష్ణ, ఎస్.వెంకటేశ్వరరావు, నాయకులు ఎస్.అశ్రీయ్య, పి.పుల్లారెడ్డి, పి.నరసింహమూర్తి పాల్గొన్నారు.

రంగు మారిన ధాన్యాన్ని కొనుగోలు చేయాలి : టిడిపి

ప్రజాశక్తి - భీమవరం రూరల్

రంగు మారిన ధాన్యాన్ని ప్రభుత్వం కొనుగోలు చేయాలని టిడిపి ఆధ్వర్యంలో తహశీల్దార్ కార్యాలయం వద్ద శుక్రవారం ఆందోళన చేపట్టారు. అనంతరం తహశీల్దార్కు వినతిని సమర్పించారు. ఈ సందర్భంగా పార్టీ జిల్లా అధ్యక్షురాలు భీమవరం నియోజకవర్గ ఇన్ఛార్జి తోట సీతారామలక్ష్మీ మాట్లాడుతూ రాష్ట్రంలో కురుస్తున్న భారీవర్షాలకు కోస్తా, రాయలసీమ జిల్లాల్లోని పంటలు నీటిలో నాని పంటనష్టం వాటిల్లిందని, ఆయా రైతులను ఆదుకునేందుకు తగిన పరిహారం అందించాలని, రంగుమారిన ధాన్యాన్ని వెంటనే కొనుగోలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రాష్ట్ర కోశాధికారి మెంటే పార్థసారథి మాట్లాడుతూ అకాలవర్షాల వల్ల జరిగిన పంటనష్టం అంచనావేసి రైతులకు పరిహారం అందించాలని కోరారు. రాష్ట్ర కార్యదర్శి వేండ్ర శ్రీనివాస్ మాట్లాడుతూ వరి, మొక్కజొన్న రైతులకు ఎకరాకు రూ.30 వేలు, మిర్చి, అరటి, మామిడి రైతులకు ఎకరాకు రూ.50 వేల పరిహారాన్ని అందించాలని కోరారు. పట్టణ అధ్యక్షులు ఇందుకూరి సుబ్రహ్మణ్యరాజు మాట్లాడుతూ నష్టపోయిన రైతులకు రాయితీపై విత్తనాలు అందజేసి, పిడుగుపాటుకు మరణించిన కుటుంబాల వారికి రూ.20 లక్షల పరిహారం అందించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు రేవు వెంకన్న, కొయ్యలగడ్డ గణపతి, మామిడిశెట్టి ప్రసాద్, మాదాసు కనకదుర్గ, గునుపూడి తిరుపాల్, ఎద్దు ఏసుపాదం పాల్గొన్నారు.

670 మందికి కళ్యాణమస్తు లబ్ధి : కలెక్టర్ ప్రశాంతి

ప్రజాశక్తి - భీమవరం

వైఎస్ఆర్ కల్యాణమస్తు, వైఎస్ఆర్ షాదీ తోఫా కింద ఈ ఏడాది జనవరి నుండి మార్చి వరకూ వివాహాలు చేసుకున్న జిల్లాలోని 670 మంది మహిళలకు రూ.నాలుగు కోట్ల 47 లక్షల 70 వేలు వారి ఖాతాల్లో ప్రభుత్వం జమచేస్తుందని కలెక్టరు పి.ప్రశాంతి తెలిపారు. స్థానిక కలెక్టరేట్లో కళ్యాణమస్తు, వైఎస్ఆర్ షాదీ తోఫా పంపిణీని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ షెడ్యూల్డ్ క్యాస్ట్కు ఒక్కొక్కరికి రూ.లక్ష చొప్పున 146 మందికి రూ.కోటీ 46 లక్షలు, షెడ్యూల్డ్ కులాలు వారు కులాంతర వివాహం చేసుకున్న వారికి ఒక్కొక్కరికి రూ.లక్షా 20 వేలు చొప్పున 23 మందికి, రూ.27లక్షల60వేలు, షెడ్యూల్ ట్రైబల్ వారికి ఒక్కొక్కరికి రూ.లక్ష చొప్పున, ముగ్గురికి రూ.మూడు లక్షలు, షెడ్యూల్డ్ ట్రైబల్ వారు కులాంతర వివాహం చేసుకున్న వారికి రూ.లక్షా20 వేలు చొప్పున ఒక్కరికి రూ.లక్షా 20 వేలు, బిసిలకు ఒక్కొక్కరికి రూ.50 వేలు చొప్పున 428 మందికి రూ.రెండు కోట్ల 14లక్షలు వారి ఖాతాలో జమ చేస్తారని తెలిపారు. అలాగే బిసి మహిళలు కులాంతర వివాహం చేసుకున్న వారికి ఒక్కొక్కరికి రూ.75వేలు చొప్పున 36 మందికి రూ.27 లక్షలు, మైనార్టీలకు ఒక్కొక్కరికి రూ.లక్ష చొప్పున ఆరుగురికి రూ.ఆరు లక్షలు, వికలాంగులకు ఒక్కొక్కరికి రూ.1.5 లక్షలు 11 మందికి రూ.16 లక్షల 50 వేలు, ఒసిలలో భవన నిర్మాణ కార్మికుల కార్డు కలిగిన వారికి ఒక్కొక్కరికి రూ.40, వేలు చొప్పున 16 మందికి రూ.ఆరు లక్షల 40 వేలు చొప్పున మొత్తం జిల్లాలో 670 మందికి రూ.నాలుగు కోట్ల 47 లక్షల 70 వేలు లబ్ధిదారుల ఖాతాల్లో జమ చేస్తారని కలెక్టర్ తెలిపారు. ప్రతి మూడు నెలలకు ఒకసారి వైఎస్ఆర్ కల్యాణమస్తు, షాదీ తోఫా అందించడం జరుగుతుందని తెలిపారు. వివాహాలు చేసుకున్న మహిళలు ఎవరైనా ఉంటే సంబంధిత గ్రామ, వార్డు సచివాల యాల్లో దరఖాస్తు చేసుకుని కళ్యాణ మస్తు, షాదీ తోఫా పొందాలని సూచించారు. అనంతరం లబ్ధిదారులకు మాన్యువల్ చెక్కును కలెక్టర్ ద్వారా అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి కె.కృష్ణవేణి, డిఆర్డిఎ పీడీ వేణుగోపాల్, జిల్లా సాంఘిక సంక్షేమ అధికారి బి.శోభారాణి, జిల్లా గిరిజన సంక్షేమ శాఖ అధికారి డి.పుష్పరాణి, జిల్లా ప్రాజెక్టు మేనేజరు కె.శ్రీనివాస్ పాల్గొన్నారు.

ప్రభుత్వం దృష్టికి ధాన్యం కొనుగోలు సమస్యలు

జిల్లా ప్రత్యేక అధికారి కన్నబాబు

ప్రజాశక్తి - పాలకోడేరు

ప్రస్తుత వాతావరణ పరిస్థితుల నేపథ్యంలో ధాన్యంలో నూక, తేమ శాతం నిబంధనలను సడలించే విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని జిల్లా ప్రత్యేక అధికారి కన్నబాబు అన్నారు. మోగల్లులో కన్నబాబు, కలెక్టర్ పి.ప్రశాంతి, ఆర్డిఒ దాసి రాజు, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి వెంకటేశ్వరరావు శుక్రవారం పర్యటించారు. వర్షం కారణంగా ధాన్యం దెబ్బతిన్న రైతులతో అధికారులు మాట్లాడారు. ఈ సందర్భంగా పలువురు రైతులు తడిసిరంగుమారిన ధాన్యాన్ని ప్రభుత్వం కొనుగోలు చేసేలా చర్యలు తీసుకోవాలని కోరారు. అలాగే ధాన్యంలో తేమ, నూక శాతం నిబంధనలు సడలించేలా సిఫార్సు చేయాలని కోరారు. ఈ విషయం ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి రైతులను అన్నివిధాలా ఆదుకునేలా చర్యలు తీసుకుంటామన్నారు. వీరి వెంట ఎడిఎ వి.నారాయణరావు, రెవెన్యూ సిబ్బంది ఉన్నారు.

అస్తవ్యస్తంగా విద్యా వ్యవస్థ

పట్టభద్రుల ఎంఎల్సి ఐ.వెంకటేశ్వరరావు

ప్రజాశక్తి - భీమవరం



మాట్లాడుతున్న ఇళ్ల వెంకటేశ్వరరావు

విద్యారంగంలో గతేడాది తీసుకొచ్చిన విద్యారంగ సంస్కరణల వల్ల విద్యావ్యవస్థ అస్తవ్యస్తంగా తయారైందని ఉభయ గోదావరి జిల్లాల పట్టభద్రుల ఎంఎల్సి ఐ వెంకటేశ్వరరావు విమర్శించారు. భీమవరం యుటిఎఫ్ జిల్లా కార్యాలయంలో యుటిఎఫ్ జిల్లా, మండల నాయకులకు ఒక రోజు ఉద్యమ శిక్షణా తరగతులు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి యుటిఎఫ్ జిల్లా అధ్యక్షులు పిఎస్.విజయరామరాజు అధ్యక్షత వహించారు. ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఎంఎల్సి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ గడిచిన విద్యా సంవత్సరంలో విద్యా రంగ సంస్కరణల వల్ల విద్యార్థులకు నాణ్యమైన విద్య అందకపోగా విద్యావ్యవస్థ మొత్తం అస్తవ్యస్తంగా తయారైందని విమర్శించారు. ప్రణాళిక లేకుండా హడావుడీగా సంస్కరణలు ప్రవేశపెట్టడం వల్ల కిలోమీటరులోపు ఉన్న ప్రాథమిక పాఠశాలల్లోని 3, 4, 5 తరగతులను ఉన్నత పాఠశాలల్లో విలీనం చేశారని తెలిపారు. దీంతో 1, 2 తరగతులతో ఉన్న ప్రాథమిక పాఠశాలలు మూతపడే స్థితికి వచ్చాయని విమర్శించారు. యుటిఎఫ్ రాష్ట్ర కోశాధికారి గోపీమూర్తి మాట్లాడుతూ ప్రభుత్వం హైస్కూల్ పేరుతో బాలికలకు ఇంటర్మీడియట్ కళాశాలలను తెరుస్తూ ఉత్తర్వులు ఇచ్చారని, అయితే ఆయా కళాశాలలకు టీచింగ్ స్టాఫ్ ఇవ్వకుండా గాలికొదిలేశారని తెలిపారు. దీంతో బాలికలు ఉత్తీర్ణులు కాకపోవడంతో తల్లిదండ్రుల్లో వ్యతిరేకత వ్యక్తం అవుతోందని తెలిపారు. వెంటనే ప్రభుత్వ విద్యాశాఖ హైస్కూల్, జూనియర్ కళాశాలలకు బోధనా సిబ్బందిని ప్రమోషన్ ద్వారా నియమించాలని డిమాండ్ చేశారు. జిల్లా ప్రధాన కార్యదర్శి ఎ కెవి రామభద్రం మాట్లాడుతూ జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలలను రక్షించుకోవడానికి యుటిఎఫ్ నాయకులు, కార్యకర్తలు కృషిచేయాలని పిలుపునిచ్చారు. ఈ శిక్షణా తరగతులకు ప్రిన్సిపల్గా కెఎస్ సిహెచ్.సాయిరామ్ వ్యవహరించారు. రిసోర్స్ పర్సన్లు బి.గోపీమూర్తి, ఎకెవి రామభద్రం జివి రామానుజరావు, క్రాంతి కుమార్ ఉపాధ్యాయులకు తరగతులు బోధించారు. ఈ కార్యక్రమంలో మార్కెండేయులు, పట్టాభి రామయ్య, జి.రాజశేఖర్, జి.లక్ష్మినారాయణ, రామకృష్ణ ప్రసాద్, డి.రామకృష్ణంరాజు, పద్మావతి, నాయకులు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాల క్యాలెండర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి - భీమవరం



క్యాలెండర్ విడుదల చేస్తున్న కలెక్టర్ ప్రశాంతి

రాష్ట్ర ప్రభుత్వం 2023 - 24లో అమలు చేసే వివిధ సంక్షేమ పథకాల వివరాలతో రూపొందించిన సంక్షేమ క్యాలెండర్ను జిల్లా కలెక్టరు పి.ప్రశాంతి ఆవిష్కరించారు. శుక్రవారం స్థానిక కలెక్టర్ ఛాంబర్లో కలెక్టర్ క్యాలెండర్ ఆవిష్కరించి మాట్లాడారు. 2023 - 24లో ప్రభుత్వం సంక్షేమ పథకాలకు సంబంధించి ఏ నెలలో ఏ పథకం ద్వారా లబ్ధిదారులకు ప్రయోజనం కలగనుందో వాటి వివరాలతో కూడిన క్యాలెండర్ను రూపొందించామని తెలిపారు. వాటిని అన్ని ప్రభుత్వ కార్యాలయాలకూ అందజేయాలని కలెక్టరు సూచించారు. సంవత్సర కాలంలో అమలు చేసే సంక్షేమ కార్య క్రమాలను సంక్షిప్తంగా ఈ క్యాలెండరు ద్వారా తెలుసుకోవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా సమాచార పౌర సంబంధాల అధికారి డి.నాగార్జున పాల్గొన్నారు.



తడిసిన ధాన్యాన్ని ఆరబెడుతున్న రైతు

పోడూరులో వర్షం.. తడిసిన ధాన్యం

ప్రజాశక్తి - పోడూరు

పోడూరు శుక్రవారం కూడా వర్షం కురిసింది. దీంతో కల్లాల్లో ఆరబెట్టిన ధాన్యం తడిసిపోయాయి. పలుచోట్ల ధాన్యం మొలకెత్తడంతో రైతులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. తడిసిన, మొలకెత్తిన ధాన్యాన్ని ప్రభుత్వమే కొని తమకు న్యాయం చేయాలని రైతులు కోరుతున్నారు. తన మూడెకరాల పంట వర్షానికి తడిసిపోయి మొలకెత్తిందని పెనుమదం గ్రామానికి చెందిన కౌలు రైతు అసుల రామకృష్ణ ఆవేదన వ్యక్తం చేశాడు. ధాన్యాన్ని ప్రభుత్వం కొనుగోలు చేసి ఆదుకోవాలని కోరుతున్నాడు.

కోపల్లె హైస్కూల్లో స్టాక్ పాయింట్ల పరిశీలన

ప్రజాశక్తి - కాళ్ల

కోపల్లె హైస్కూల్లో ప్రభుత్వ పాఠ్యపుస్తక గొడౌన్లో ఉన్న పాఠ్యపుస్తకాలు, యూనిఫామ్, షూల నాణ్యతను డిఇఒ ఆర్.వెంకటరమణ శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా డిఇఒ వెంకటరమణ మాట్లాడుతూ వచ్చే విద్యా సంవత్సరానికి జిల్లా పరిధిలోని ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు పాఠశాలలు తెరవక ముందే మండల స్టాక్ పాయింట్లకు పుస్తకాలు చేరవేస్తున్నట్లు చెప్పారు. మెటీరియల్ పూర్తి స్థాయిలో వచ్చిన తర్వాత పాఠ్యపుస్తకాలతోపాటు, వర్క్బుక్స్, సెమిస్టర్ పుస్తకాలను పూర్తిస్థాయిలో పంపిణీ చేస్తామన్నారు. విద్యాసంవత్సరం ముగిసే నాటికే మరుసటి విద్యా సంవత్సరానికి అవసరమైన పుస్తకాలను ముద్రించి, మండలాలకు పంపినట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎంఇఒ ఎ.రవీంద్ర, సిఆర్పిలు వెంకన్న బాబు, అప్పారావు, సిబ్బంది పాల్గొన్నారు.

చంద్రబాబుకు రైతుల గురించి మాట్లాడే హక్కు లేదు

మంత్రి కారుమూరి నాగేశ్వరరావు

ప్రజాశక్తి - తణుకు

రైతుల గురించి మాట్లాడే అర్హత టిడిపి అధినేత చంద్రబాబుకు లేదని రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు అన్నారు. శుక్రవారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. వ్యవసాయమే దండగన్న చంద్రబాబు ఏ మొహం పెట్టుకుని రైతుల దగ్గరకు వచ్చారని అన్నారు. చంద్రబాబు ముఖ్యమంత్రిగా ఉండగా సివిల్ సప్లై నిధులు రూ.4900 కోట్లు పసుపు కుంకుమ కింద తరలించారని విమర్శించారు. టిడిపి ప్రభుత్వంలో రైతులకు చెల్లించాల్సిన రూ.వెయ్యి కోట్లు ఇవ్వకుండా వదిలేస్తే వైసిపి ప్రభుత్వం వచ్చాక వాటిని చెల్లించిందన్నారు. రైతులకు ఎటువంటి ఇబ్బంది కలగకుండా జిల్లా కలెక్టరులు, అధికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నారని తెలిపారు. నష్టపోయిన రైతులను ఆదుకుంటామని, వారికి ప్రభుత్వం అండగా ఉంటుందని సిఎం భరోసా ఇచ్చారని వివరించారు.

రోడ్డు భద్రతా చర్యలు చేపట్టాలి : డిఆర్ఒ



మాట్లాడుతున్న డిఆర్ఒ కృష్ణవేణి

భీమవరం :జిల్లాలో రోడ్డు ప్రమాదాల బ్లాక్ స్పాట్లను ఆర్అండ్బి, నేషనల్ హైవే, పంచాయతీరాజ్, మున్సిపల్, ట్రాన్స్పోర్ట్, పోలీస్ అధికారులు సంయుక్తంగా తనిఖీ చేసి రోడ్డు భద్రతా చర్యలు తీసుకోవాలని జిల్లా రెవెన్యూ అధికారి కె.కృష్ణవేణి ఆదేశించారు. శుక్రవారం జిల్లా కలెక్టరేట్లో నిర్వహించిన జిల్లా రోడ్డు భద్రతా కమిటీ సమావేశానికి జిల్లా రెవెన్యూ అధికారి అధ్యక్షత వహించి మాట్లాడారు. గత సమావేశంలో నిర్దేశించిన పనులు ఇంకా పూర్తి కాలేదని, వాటిని త్వరగా పూర్తి చేయాలని తెలిపారు. జిల్లాలో రోడ్డు ప్రమాదాల నివారణ చర్యలపై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. ఇందుకు సంబంధించి రవాణా, పోలీస్, జాతీయ రహదారి, ఆర్అండ్బి, పంచాయతీ రాజ్ తదితర శాఖల అధికారులకు పలు సూచనలు చేశారు. జిల్లాలో రోడ్డు ప్రమాదాల నివారణకు అవసరమైన హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేయాలన్నారు. కళాశాల విద్యార్థులకు రోడ్డు భద్రతపై విస్తృత అవగాహన కల్పించాలన్నారు. హెల్మెట్ ధరించకపోవడం, అపసవ్య దిశలో వాహనాలు ప్రయాణం, రోడ్డు నిబంధనలు పాటించకపోవడం, తదితర మానవ తప్పిదాల కారణంగానే ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. జాతీయ రహదారిని కలిపే రోడ్ల వద్ద హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలన్నారు. సమావేశంలో అడిషనల్ ఎస్పి ఎవి.సుబ్బరాజు, జిల్లా ట్రాన్స్ పోర్ట్ అధికారి టి.ఉమామహేశ్వరరావు, ఆర్అండ్బి ఇఇ ఎస్.లోకేశ్వరరావు, నేషనల్ హైవే డిఇ ఎం.శ్రీనివాసరావు, డిఎంహెచ్ఒ డి.మహేశ్వరరావు, ఆర్టిసి ఆర్ఎం వీరయ్య చౌదరి, అధికారులు పాల్గొన్నారు.

గోనె సంచులు ఇవ్వాలి

ఆర్డిఒ వద్ద రైతుల ఆవేదన

ప్రజాశక్తి - గణపవరం



ఆర్డిఒ దాసి రాజు వద్ద ఆవేదన వ్యక్తం చేస్తున్న రైతులు

గోనె సంచులు లేకపోవడంతో ధాన్యాన్ని రైస్ మిల్లుకు తరలించడానికి ఇబ్బందులు పడుతున్నామని వల్లూరు గ్రామ రైతులు భీమవరం ఆర్డిఒ దాసి రాజు వద్ద ఆవేదన వ్యక్తం చేశారు. శుక్రవారం ఆర్డిఒ దాసి రాజు వల్లూరు ఆర్బికెను పరిశీలించారు. ఈ సందర్భంగా రైతులు ఆర్డిఒ వద్ద రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. వర్షం వల్ల ధాన్యం తడిసి ముద్దవుతున్నాయని, ఎగుమతి చేయడానికి సంచులతోపాటు మిల్లుకు తరలించడానికి వాహనాలు సరఫరా చేయాలని కోరారు. దీనిపై ఆర్డిఒ మాట్లాడుతూ రైతులకు ఇబ్బంది లేకుండా వెంటనే సంచులు, రవాణాకు వాహనాలు ఏర్పాటు చేస్తామని చెప్పారు. రైతులకు ఇబ్బంది లేకుండా ప్రభుత్వం అన్ని విధాలుగా సహకారం అందిస్తుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ పమ్మి లక్ష్మి, వ్యవసాయాధికారి వై.ప్రసాద్, ఎంపిడిఒ జి.జ్యోతిర్మయి, ఆర్బికె సిబ్బంది పాల్గొన్నారు.

వైఎన్లో హెల్ప్డెస్క్ ప్రారంభం

ప్రజాశక్తి - నరసాపురం టౌన్

వైఎన్ కళాశాలలో డిగ్రీ మొదటి సంవత్సరం ప్రవేశాలకు హెల్ప్ డెస్క్ను శుక్రవారం కళాశాల ప్రిన్సిపల్ ఎపివి.అప్పారావు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఇంటర్ పాసైన విద్యార్థులు డిగ్రీలో చేరేందుకు, ఏ కోర్సులో చేరితే ఎలా ఉంటుందనే విషయాలపై, ఫీజు వివరాల గురించి వారికి అవగాహన కల్పించేందుకు కళాశాలలో హెల్ప్ డెస్క్ను ఏర్పాటు చేశామన్నారు. నూతన ప్రవేశాల కోసం విద్యార్థులు ఇక్కడకు వచ్చి తమ సందేహాలను, అనుమానాలను నివృత్తి చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కళాశాల డీన్ గంధం శ్రీరామకృష్ణ, వైస్ ప్రిన్సిపల్ సిహెచ్.కనకారావు, బెజవాడ వెంకట రత్నం, పీజీ ఇన్ఛార్జి డైరెక్టర్ ఆర్.పార్థసారధి, ఉదయభాస్కర్ పాల్గొన్నారు.

గృహ నిర్మాణాలు వేగవంతం చేయాలి

ప్రజాశక్తి - పెనుమంట్ర

జగనన్న లేఅవుట్లో గృహ నిర్మాణాలు వేగవంతం చేయాలని హౌసింగ్ ఎఇ ఎకె.మల్లేశ్వరరావు అన్నారు. పొలమూరులో సచివాలయం వన్ లో శుక్రవారం లబ్ధిదారులకు సర్పంచి కాకర రాజేశ్వరరావు ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మల్లేశ్వరరావు మాట్లాడుతూ డ్వాక్రా నుంచి లబ్ధిదారులకు రుణంగా రూ.30 వేల నుండి రూ.లక్ష వరకూ ఇవ్వాలని డ్వాక్రా సిఎలకు సూచించారు. ఇంజినీరింగ్ అసిస్టెంట్, పంచాయతీ సెక్రటరీలకు నిర్మాణాలు వేగవంతం చేయాలని ఆదేశించారు. సొసైటీ అధ్యక్షుడు కలిదిండి సుబ్రహ్మణ్యంరాజు, ఎంపిటిసి సభ్యురాలు మాచిరెడ్డి నాగదుర్గ, వర్క్ ఇన్స్పెక్టర్ సూర్యనారాయణ పాల్గొన్నారు.

పాలకొల్లులో అన్న సమారాధన

ప్రజాశక్తి - పాలకొల్లు

పాలకొల్లు యడ్ల బజార్ సెంటర్లోని కనకదుర్గ మల్లేశ్వర ఆలయంలో శుక్రవారం అన్న సమారాధన భారీ ఎత్తున జరిగింది. మహిళలు పెద్ద ఎత్తున అన్న సమారాధనలో పాల్గొన్నారు. ఆలయ చైర్మన్ కావలి శ్రీనివాస్, ట్రస్టీ నాగేశ్వరరావు, రాంబాబు దగ్గరుండి అన్నసమారాధన నిర్వహించారు.



పాఠశాలకు గ్లాసులు అందజేస్తున్న అధికారులు

పాఠశాలలకు గ్లాసులు అందజేత

ప్రజాశక్తి - పాలకొల్లు

రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపట్టిన రాగిజావ కోసం మున్సిపాల్టీ పరిధిలోని 97 ప్రభుత్వ పాఠశాలలకు వచ్చిన 8600 గ్లాసులను శుక్రవారం పంపిణీ చేశారు. ఎంఐఎస్ కోఆర్డినేటర్ టి.జనార్ధన్, సిఆర్పిలు బి.రామకృష్ణ, రాజరాజేశ్వరి, స్కూల్ ప్రధానోపాధ్యాయులకు అందజేశారు. గ్లాసులు అందుకున్న వారిలో వీవర్స్‌కాలనీలోని జివిఆర్ మున్సిపల్ స్కూల్ హెచ్ఎం రాయపూడి భవాని ప్రసాద్ ఉన్నారు.

పోడూరు : ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థుల్లో రక్త హీనత నివారణ కోసం రాష్ట్ర ప్రభుత్వం రాగి జావ అందజేస్తోంది. ప్రతి విద్యార్థికీ రోజు విడిచి రోజు 120 మి.లీ జావను ఇవ్వాలని రాగి పిండిని, బెల్లంను పాఠశాలలకు పంపిణీ చేసింది. తిరిగి వేసవి సెలవుల అనంతరం విద్యార్థులు ఇంటి వద్ద నుండి గ్లాసులు తెచ్చుకోనవసరం లేకుండా స్టీల్ గ్లాసులను పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు అందించి పాఠశాలలలో భద్రపర్చారు.

రూ.6.38 లక్షలతో వీధి లైట్ల ఏర్పాటు

ప్రజాశక్తి - వీరవాసరం

రాయకుదురు గ్రామ పంచాయతీ పరిధిలో రూ.6.38 లక్షలతో వీధి లైట్లు ఏర్పాటు పనులను సర్పంచి గెద్దం భారతీ భాస్కరరావు శుక్రవారం ప్రారంభించారు. రాయకుదురు నుంచి చింతలకోటి గరువు మార్గంలో, జగన్నాధరావుపేట, శ్మశానం వద్ద స్తంభాలు ఏర్పాటు చేసి వీధి లేట్లు వేస్తామని సర్పంచి తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ జెడ్‌పిటిసి పోలిశెట్టి సత్యనారాయణ, లొల్ల సీతారాం ప్రసాద్, విప్పర్తి రత్నకుమారి, పాలకవర్గ సభ్యులు పాల్గొన్నారు.

చవాకుల ట్రస్టు ఆధ్వర్యంలో చలివేంద్రం

ప్రజాశక్తి - పాలకొల్లు

పాలకొల్లు చవాకుల ఛారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో రైల్వే గేట్ వద్ద చలివేంద్రాన్ని ఎస్ఐ సానబోయిన ముత్యాలరావు శుక్రవారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో చవాకుల ఛారిటబుల్ ట్రస్ట్ ఫౌండర్ అండ్ ఛైర్మన్ చవాకుల సూర్య నరేష్ బాబు, ప్రజా నేతలు వంగా నరసింహారావు, దుగ్గిన రాము పాల్గొన్నారు.



మాట్లాడుతున్న పాతపాటి వాసు

వైభవంగా వెంకన్న రథోత్సవం

ప్రజాశక్తి - కాళ్ల

కాళ్లకూరు వెంకటేశ్వర స్వామి దేవస్థానంలో వార్షిక కళ్యాణోత్సవాల్లో భాగంగా ఏడో రోజు శుక్రవారం స్వామి వారి రథోత్సవం నిర్వహించారు. ఉండి ఎంఎల్ఎ మంతెన రామరాజు, రాష్ట్ర క్షత్రియ కార్పొరేషన్ ఛైర్మన్ పాతపాటి వెంకట శ్రీనివాసరాజు, డిఎన్ఆర్ కళాశాల పాలకవర్గ అధ్యక్షులు గోకరాజు నరసింహరాజు కొబ్బరికాయలు కొట్టి రథాన్ని లాగారు. శక్తి వేషాలు, తీన్మార్, బుట్ట బొమ్మల ప్రదర్శన, డప్పులు, బ్యాండ్ మేళం, సన్నాయి మేళం ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. స్వామివారి రథోత్సవం అంగరంగ వైభవంగా ఆలయ కమిటీ ఛైర్మన్ దండు వెంకట కృష్ణంరాజు, ఇవో అరుణ్ కుమార్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఆలయ ఛైర్మన్ వెంకట కృష్ణంరాజు, ధర్మకర్తలు, దాతలు, ఇఒ ఏర్పాట్లను పర్యవేక్షించారు. కాళ్లకూరు గ్రామానికి చెందిన దాట్ల వెంకట రామరాజు ఆర్థిక సహకారంతో దాట్ల శ్రీదేవి మెమోరియల్ ట్రస్ట్ ద్వారా ఉచితంగా మజ్జిగ పంపిణీ చేశారు. భీమవరం గ్రామానికి చెందిన అల్లూరి పద్మరాజు దంపతుల ఆర్థిక సహకారంతో ఉచితంగా పులిహోర పంపిణీ చేశారు.

పరిసరాల పరిశుభ్రతకు తోడ్పడాలి

మున్సిపల్ ఛైర్‌పర్సన్ శ్రీ వెంకటరమణ

ప్రజాశక్తి - నరసాపురం టౌన్

పరిసరాల పరిశుభ్రత అందరి బాధ్యత అని మున్సిపల్ ఛైర్‌పర్సన్ బర్రి శ్రీవెంకటరమణ జయరాజు అన్నారు. శుక్రవారం నరసాపురం 8వ వార్డులో మున్సిపల్ అధికారులు, సిబ్బందితో కలిసి ఛైర్‌పర్సన్ శ్రీవెంకట రమణ అక్కడ ప్రాంతాలను పరిశీలించారు. డ్రెయినేజీలో పూడికతీత పనులు ఎప్పటికప్పుడు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. దోమల నిర్మూలనకు ఫాగింగ్ చేయాలన్నారు. బ్లీచింగ్ చల్లాలని, విధి నిర్వహణలో అలసత్వం వహిస్తే శాఖా పరమైన చర్యలు తీసుకుంటామని సిబ్బందిని హెచ్చరించారు. పరిసరాల శుభ్రతకు ప్రజలు తగిన ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్ బర్రె జయరాజు, మున్సిపల్ కమిషనర్ కె.వెంకటేశ్వరరావు, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్, టిపిఎస్, ఎఇలు, సచివాలయ, శానిటరీ మేస్త్రీలు, సిబ్బంది పాల్గొన్నారు.



వార్డులను పరిశీలిస్తున్న మున్సిపల్ ఛైర్‌పర్సన్

ఉపాధి హామీని పటిష్టంగా అమలు చేయాలి : వ్యకాస

ప్రజాశక్తి - అత్తిలి

వ్యవసాయ కూలీలకు జీవనోపాధి కల్పిస్తున్న ఉపాధి హామీని పటిష్టంగా అమలు చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి బళ్ల చిన వీరభద్రరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం అత్తిలిలో పనిచేస్తున్న ఉపాధి కూలీలను కలిసి కొద్దిసేపు వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం వీరభద్రరావు మాట్లాడుతూ ఉపాధి హామీ చట్టం వచ్చిన తర్వాత గ్రామీణ ప్రాంతాల నుంచి పట్టణాలకు వలస పోకుండా ఉన్న ఊరిలోనే ఉపాధి పనులు చేసుకుంటూ జీవిస్తున్నారని చెప్పారు. అటువంటి ప్రాధాన్యత కలిగిన ఉపాధి హామీని కేంద్రంలోని మోడీ ప్రభుత్వం మరింత పటిష్టంగా అమలు చేయాల్సిందిపోయి, భూస్వాములు, పెట్టుబడిదారులకు ఉపాధి హామీ నిధులు దోచి పెడుతూ చట్టాన్ని ఎత్తివేయాలని కుట్ర పన్నుతోందన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి బడ్జెట్లో అధిక నిధులు కేటాయించి కూలీలకు ఎక్కువ రోజులు పని కల్పించాలని కోరారు. పెరిగిన ధరలకు అనుగుణంగా కూలి రూ.600 ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో బొంతు లక్ష్మి, కవురు చంద్రకళ, శనగన వెంకటేశ్వరరావు, బొంతు శ్రీను, మట్టపర్తి లక్ష్మి, పిల్లి ఆశీర్వాదం, బొంతు సీతారత్నం పాల్గొన్నారు.



కూలీలతో మాట్లాడుతున్న చిన వీరభద్రరావు

జెవివి ఆధ్వర్యంలో వేసవి విజ్ఞాన శిబిరం

ప్రజాశక్తి - పెనుమంట్ర

డివైఎఫ్ఐ, ఐద్వా సహకారంతో జెవివి ఆధ్వర్యంలో వేసవి వినోద కార్యక్రమాలు పొలమూరు కలిదిండి సూర్యనారాయణ రాజు జన విజ్ఞాన వేదిక కార్యాలయం వద్ద శుక్రవారం మాజీ సర్పంచి చింతపల్లి రామకృష్ణ, బాలల సంఘం జిల్లా అధ్యక్షుడు ఋషీ ప్రారంభించారు. ముందుగా అమరులైన చింతపల్లి శ్రీనివాస్, కేతా సత్యప్రసాద్ చిత్రపటాలకు నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఐద్వా జిల్లా నాయకురాలు జయప్రద పిల్లలకు పద్యాలు, కథలు నేర్పారు. జెవివి జిల్లా అధ్యక్షుడు చింతపల్లి ప్రసాదరావు కూల్ డ్రింక్స్‌పై అవగాహన కల్పించారు. స్పోకెన్ ఇంగ్లీష్ నేర్పారు. మ్యాజిక్ ప్రదర్శన నిర్వహించారు. మొదటి రోజు చిన్నారులకు స్నాక్స్ గ్రామ పెద్ద చింతపల్లి గురు ప్రసాద్ అందజేశారు. డివైఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శి చింతపల్లి మావో లెక్కల్లో మెలకువలు నేర్పించారు. కార్యక్రమాలు అనంతరం కథలు, పోటీల్లో పాల్గొన్న చిన్నారులకు ప్రోత్సాహక బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో డివైఎఫ్ఐ జిల్లా నాయకురాలు చింతపల్లి భారతి, కేతా ప్రమోద్, చింతపల్లి భరత్‌చంద్ర చుట్టుపక్కల ప్రాంతాలలో ఉన్న 40 మంది చిన్నారులు, పెద్దలు పాల్గొన్నారు.



ప్రోత్సాహకాలు అందిస్తున్న జెవివి జిల్లా అధ్యక్షుడు ప్రసాద్‌రావు

పోడూరు: జిన్నూరు శాఖా గ్రంథాలయంలో ఈ నెల 8వ తేదీ నుంచి జూన్ 16వ తేదీ వరకూ 40 రోజుల పాటు వేసవి విజ్ఞాన శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు గ్రంథాలయాధికారి బత్తుల జోగారత్నం శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రతి రోజూ ఉదయం 8 గంటల నుండి మధ్యాహ్నం 12 గంటల వరకూ శిక్షణ తరగతులు నిర్వహించనున్నట్లు తెలిపారు. విద్యార్థులు వేసవి సెలవుల్లో సమయాన్ని సద్వినియోగం చేసుకొని, సృజనాత్మక శక్తిని పెంపొందించుకోవాలన్నారు. గ్రంథాలయంలో ప్రతిరోజూ నిర్వహించే వివిధ అంశాల్లో పాల్గొని, ప్రతిభ పాటవాలను ప్రదర్శించిన విద్యార్థులకు, సర్టిఫికెట్లు ఇవ్వనున్నట్లు తెలిపారు. తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, విద్యార్థులను ప్రోత్సహించి వేసవి విజ్ఞాన శిబిరంలో పాల్గొనేటట్లు ప్రోత్సాహించాలని గ్రంథాలయాధికారి జోగారత్నం కోరారు.



ఫ్రైడే డ్రైడే కార్యక్రమం నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

పరిసరాల పరిశుభ్రత అవసరం

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

పరిసరాలను పరిశుభ్రతగా ఉంచడంలో ప్రజలు భాగస్వాములు కావాలని పట్టణ మలేరియా సబ్ యూనిట్ అధికారి వైవి.లక్ష్మణరావు పిలుపునిచ్చారు. శుక్రవారం పట్టణంలోని 15, 16 వార్డుల పరిధిలోని క్లస్టర్ 14, 16, 13 అలాగే 1, 3, 6, 7, 8 వార్డుల్లో జరుగుతున్న ఫ్రైడే డ్రైడే, ఫీవర్‌సర్వే చేశారు. అనంతరం దోమల ద్వారా వచ్చే వ్యాధులపై అవగాహన కల్పించారు. మలేరియా, డెంగీ రాకుండా నివారణ ఒక్కటే ముఖ్యమన్నారు. పరిసరాల్లో నీరు నిల్వ లేకుండా జాగ్రత్త పడాలని సూచించారు. ప్రజలందరూ శుక్రవారం డ్రైడే పాటించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య కార్యదర్శులు చంద్ర, అంబిక, ఆశా కార్యకర్తలు, శానిటేషన్ కార్యదర్శి దుర్గ ప్రసాద్, వాలంటీర్లు పాల్గొన్నారు.

గణపవరం : ప్రతి శుక్రవారం ఫ్రైడే డ్రైడే పాటించి దోమల నివారణకు కృషి చేయాలని పిహెచ్‌సి డాక్టర్లు పి.సంతోష్‌నాయుడు, పి.కిరణ్మయి అన్నారు. శుక్రవారం మండలంలోని అన్ని సచివాలయాల వద్దా, పిహెచ్‌సి ఆధ్వర్యంలో ఫ్రైడే డ్రైడే నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్లు సంతోష్ నాయుడు, కిరణ్మయి మాట్లాడుతూ ఇంటి పరిసర ప్రాంతాల్లో తడి లేకుండా పొడి వాతావరణం ఉండే విధంగా చూసుకోవాలన్నారు. దోమల వల్ల డెంగీ, మలేరియా వస్తాయన్నారు. ఈ కార్యక్రమంలో సిహెచ్‌ఒ జాలాది విల్సన్ బాబు ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు. కాశిపాడులో జరిగిన ఫ్రైడే డ్రైడేలో పాల్గొన్న ఆరోగ్య సహాయకులు నామాల రాజు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఎఎన్ఎం శివకుమారి ఆశా వర్కర్లు కృష్ణకుమారి, వరలక్ష్మి పాల్గొన్నారు.

విద్యార్థులు సామాజిక సమస్యలపై అధ్యయనం చేయాలి

ప్రజాశక్తి - గణపవరం

గ్రామాల్లో ఆర్థిక సామాజిక సమస్యలపై తగిన పరిష్కారాలు కనుగోడానికి విద్యార్థులకు కమ్యూనిటీ ప్రాజెక్టు ఉపయోగపడుతుందని ఎఐటియుసి రాష్ట్ర ఉపాధ్యక్షులు డి.సోమ సుందరం అన్నారు. శుక్రవారం స్థానిక డిగ్రీ కాలేజీలో మొదటి సంవత్సరం విద్యార్థులతో ముఖాముఖీ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కాలేజీ ప్రిన్సిపల్ పి.నిర్మలాకుమారి అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా సోము సుందరం మాట్లాడుతూ రాష్ట్ర హయ్యర్ ఎడ్యుకేషన్ ఇచ్చిన మార్గదర్శకాల ప్రకారం కమ్యూనిటీ ప్రాజెక్ట్ అమలు చేయడానికి గణపవరం పరిసర గ్రామాలు అధ్యయనాంశాలుగా ఉన్నాయన్నారు. గోదావరి డెల్టాకు కొల్లేరు ఆనుకొని ఉన్న గ్రామాల్లో వ్యవసాయం, ఆక్వా సాగు ప్రధాన ఆర్థిక వనరులుగా ఉన్నాయన్నారు. వాటిపై ఆధారపడి స్థానిక ప్రజలు ఉపాధి పొందుతున్నట్లు తెలిపారు. కాలేజీ వైస్ ప్రిన్సిపల్ పి.మధురాజు మాట్లాడారు. కార్యక్రమంలో ఎన్‌విఎన్‌వి.సుబ్బారావు, డివిడి చిన్న సత్యనారాయణ, బివి.రమేష్ బాబు, విద్యార్థులు పాల్గొన్నారు.

పేదలకు దుప్పట్లు, చీరలు పంపిణీ

ప్రజాశక్తి - గణపవరం

పేదవారికి చేయూతనందించడమే మానవత లక్ష్యమని సంస్థ రాష్ట్ర అభివృద్ధి కమిటీ కన్వీనర్ సాగిరాజు జానకిరామరాజు అన్నారు. శుక్రవారం మానవత ఆధ్వర్యంలో పిప్పర గ్రామంలో పేదవారికి దుప్పట్లు, చీరలు అందజేశారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశానికి సంస్థ అధ్యక్షులు వంకాయల రామారావు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా జానకిరామరాజు మాట్లాడుతూ సంస్థ ఆధ్వర్యంలో పలు సేవా కార్యక్రమాలు జరుగుతున్నాయన్నారు. రానున్న రోజుల్లో మానవత ఆధ్వర్యంలో మరిన్ని సేవా కార్యక్రమాలు చేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో రీజియన్ ఛైర్మన్ కాకర్ల వినాయక, నాయకులు బొడ్డు శ్రీనివాసు, బుద్ధారపు పుల్లయ్య, వేముల అన్నవరం పాల్గొన్నారు.

సీతారామలక్ష్మిపై తప్పుడు ప్రచారాలు మానాలి

పోలీస్ స్టేషన్లో టిడిపి నాయకుల ఫిర్యాదు

ప్రజాశక్తి - భీమవరం రూరల్

టిడిపి జిల్లా అధ్యక్షురాలు తోట సీతారామలక్ష్మిపై సోషల్‌మీడియాలో తప్పుడు ప్రచారం చేసినవారిని అరెస్టు చేయాలని టిడిపి నాయకులు వన్ టౌన్ పోలీస్ స్టేషన్లో శుక్రవారం ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా టిడిపి రాష్ట్ర కోశాధికారి మెంటే పార్థసారథి మాట్లాడుతూ ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో జరిగిన చంద్రబాబు పర్యటనను విఫలం చేయాలని కుట్రతో పార్టీ నాయకురాలు తోట సీతారామలక్ష్మి మృతి చెందారని శ్రద్ధాంజలి ఫొటోను ఫేస్ బుక్‌లో పెట్టిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. రాష్ట్ర కార్యదర్శి వేంద్ర శ్రీనివాస్ మాట్లాడుతూ టిడిపికి అంకితభావంతో పనిచేస్తున్న తోట సీతారామలక్ష్మిపై అసత్య ప్రచారం చేసిన వారిని వెంటనే అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. పట్టణ అధ్యక్షుడు ఇందుకూరి సుబ్రహ్మణ్యంరాజు మాట్లాడుతూ భీమవరం మున్సిపల్ ఛైర్మన్‌గా రాజ్యసభ సభ్యురాలుగా గౌరవప్రదమైన పదవులు నిర్వహించిన తోట సీతారామలక్ష్మిపై అసత్య ప్రచారాలు చేసిన వారిని కఠినంగా శిక్షించాలన్నారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు రేవు వెంకన్న, కొయ్యలగడ్డ గణపతి, మామిడిశెట్టి ప్రసాద్, మాదాసు కనకదుర్గ, గునుపూడి తిరుపాల్ పాల్గొన్నారు.



పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేస్తున్న టిడిపి నేతలు

10న మండల పరిషత్ సమావేశం

నరసాపురం టౌన్ : నరసాపురం మండల పరిషత్ కార్యాలయంలో ఈ నెల 10వ తేదీ ఉదయం 10 గంటల నుంచి మండల పరిషత్ సాధారణ సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎంపిడిఒ ఎన్‌వి.శివ ప్రసాద్ యాదవ్ తెలిపారు. కార్యక్రమంలో అందరూ పాల్గొనాలని తెలిపారు.

ఎంఎల్ఎ కన్నబాబు వ్యాఖ్యలకు టిడిపి ఖండన

నరసాపురం టౌన్: యలమంచిలి ఎంఎల్ఎ కన్నబాబు చేసిన వ్యాఖ్యలను టిడిపి అగ్నికుల క్షత్రియ విభాగం ఖండించింది. నరసాపురంలోని టిడిపి కార్యాలయంలో జరిగిన సమావేశంలో నాయకులు కొప్పాడ రవీంద్ర, కొల్లు పెద్దిరాజు మాట్లాడారు. తమ సామాజిక వర్గానికి చెందిన మహిళను ఎంఎల్ఎ కన్నబాబు దుర్భాషలాడడం సరికాదన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ మున్సిపల్ వైస్ ఛైర్మన్ పొన్నాల నాగబాబు, తెలుగు యువత అధ్యకుడు బర్రి మురళి, మల్లాది మూర్తి పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి చేయాలి

జెడ్‌పి ఛైర్మన్ కవురు శ్రీనివాస్

ప్రజాశక్తి - పాలకొల్లు

గ్రామాల్లో ఇళ్ల పట్టాల పంపిణీ, ఇళ్ల నిర్మాణాలు, తాగునీటి, విద్యుత్, డ్రెయిన్లు, సీసీ రోడ్లు తదితర సమస్యలపై ప్రజలు సచివాలయ కార్యాలయాలకు వచ్చినపుడు తక్షణం స్పందించి సమస్యలను పరిష్కరించాలని జెడ్‌పి ఛైర్మన్ కవురు శ్రీనివాస్ కోరారు. శుక్రవారం వైసిపి కార్యాలయంలో అధికారులు, సర్పంచులు, ఎంపిటిసిలతో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో భాగంగా వివిధ గ్రామాలోని పలు సమస్యలు శ్రీనివాస్ దృష్టికి తీసుకొచ్చారు. సమీక్ష అనంతరం మండల కన్వీనర్ మైఖేల్‌రాజు పుట్టినరోజు సందర్భంగా పార్టీ కార్యాలయంలో కవురు శ్రీనివాస్ ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి వారికి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో ఎంపిడిఒ సంగాని వెంకటేశ్వరరావు, గవర కార్పొరేషన్ డైరెక్టర్ బోడ్డేటి సూర్యనారాయణ, సర్పంచుల ఛాంబర్ మండల అధ్యక్షులు గుమ్మపు పెద్దిరాజు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జెడ్‌పి ఛైర్మన్ శ్రీనివాస్

గంజాయి విక్రేతలపై కేసు నమోదు

ప్రజాశక్తి - భీమవరం రూరల్

మత్తు పదార్థాలు అమ్మే వారిపై మీద ఎప్పటికప్పుడు కేసులు నమోదు చేస్తూ ఉక్కుపాదం మోపుతున్నామని, ముగ్గురు గంజాయి విక్రేతలపై పీడీ యాక్ట్ నమోదు చేశామని జిల్లా ఎస్‌పి యు.రవిప్రకాష్ అన్నారు. ఈ సందర్భంగా ఎస్‌పి వివరాలు వెల్లడించారు.అడపా శ్రీరాములు, కాటూరి వెంకటేశ్వరరావు, పోలిశెట్టి రాములను గుర్తించి వారిపై పీడీ యాక్ట్ పెట్టి రాజమండ్రి సెంట్రల్ జైలుకు పంపించామని తెలిపారు. గంజాయి కేసుల్లో జైలుకు వెళ్లి వచ్చిన వారి మీద నిరంతరం నిఘా ఉంటుందని, గంజాయి తాగే వారికి నిరంతరం కౌన్సిలింగ్ నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. వారిలో మార్పు రాకపోతే వారిపై కేసు నమోదు చేస్తామన్నారు.



మాట్లాడుతున్న ఎస్‌పి రవిప్రకాష్

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

ప్రజాశక్తి - పాలకొల్లు రూరల్

శివదేవుని చిక్కాల వద్ద గురువారం రాత్రి గుర్తు తెలియని వాహనం ఢీకొట్టడంతో బల్లిపాడు గరువు గ్రామానికి చెందిన పీతల ఆనందరావుకు స్వల్ప గాయాలయ్యాయి. వివరాలు ఇలా ఉన్నాయి. ఆనందరావు తన పనులు ముగించుకుని రాత్రి తన ఇంటికి వెళ్లే సమయంలో ఈ ప్రమాదం జరిగింది. స్థానికులు అతనిని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నామని రూరల్ ఎస్ఐ సరిదే శ్రీనివాస్ తెలిపారు.

సుబ్రహ్మణ్యంకు బండారు పరామర్శ

నరసాపురం టౌన్ : నరసాపురం రుస్తుంబాద గ్రామానికి చెందిన జర్నలిస్ట్ పోలిశెట్టి చంటి సోదరుడు సుబ్రహ్మణ్యం కిడ్నీ సమస్యతో బాధపడుతున్నాడు. శుక్రవారం అతనిని మాజీ ఎంఎల్ఎ బండారు మాధవనాయుడు పరామర్శించి, ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు.

వైద్య శిబిరాలపై అవగాహన కల్పించాలి

పాలకోడేరు : వైద్య శిబిరాలపై ప్రజలకు అవగాహన కల్పించాలని జిల్లా ఉప వైద్య ఆరోగ్య శాఖ అధికారి వి.ప్రసాద్ అన్నారు. విస్సాకోడేరు బిసి సామాజిక భవనంలో శుక్రవారం ఏర్పాటు చేసిన ఫ్యామిలీ డాక్టర్ వైద్య శిబిరాన్ని ఆయన సందర్శించారు. ప్రతి రోగికీ అవసరమైన ఔషధాలను నెలకు సరిపడా అందించాలని వైద్య సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో పిహెచ్‌సి వైద్యుడు డాక్టర్ సిహెచ్‌వి.రంగమనాయుడు, డాక్టర్ లీలాలక్ష్మి, సిబ్బంది పాల్గొన్నారు.

13న జాతీయ లోక్ అదాలత్

ప్రజాశక్తి - పాలకొల్లు

ఈ నెల 13వ తేదీన జరగనున్న జాతీయ లోక్ అదాలత్‌ను కక్షిదారులు సద్వినియోగం చేసుకోవాలని మండల న్యాయ సేవాధికార సంస్థ ఛైర్మన్, ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి ఎస్.వరలక్ష్మి కోరారు. పాలకొల్లు కోర్టు వద్ద వివిధ పోలీస్, బార్ కౌన్సిల్ సభ్యులతో శుక్రవారం సమావేశమయ్యారు. లోక్ అదాలత్‌లో కేసులు రాజీ చేసుకోవడం వల్ల డబ్బు సమయం ఆదా అవుతాయన్నారు. లోక్ అదాలత్‌లో చెక్ బౌన్స్ కేసులు, కుటుంబ తగాదా కేసులు, రాజీయోగ్యమైన అన్ని కేసులూ పరిష్కరించుకోవచ్చన్నారు. ఈ అవకాశాన్ని కక్షిదారులందరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు.

భీమవరం రూరల్ : ఉన్నత న్యాయస్థానాల ఆదేశాల మేరకు ఈ నెల 13వ తేదీన భీమవరం, ఆయా కోర్టుల్లో నిర్వహించనున్న జాతీయ లోక్ అదాలత్‌ను వినియోగించుకోవాలని సీనియర్ సివిల్ కోర్టు న్యాయమూర్తి బి.అప్పారావు అన్నారు. శుక్రవారం కోర్టులో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆయా కోర్టుల్లో దాదాపు 5,524 కేసులు పెండింగ్‌లో ఉండగా 1200 కేసులను రాజీచేసే దిశగా గుర్తించినట్లు తెలిపారు. ఇప్పటికి నాలుగు గ్రామీణ ప్రాంతాల్లో న్యాయ అవగాహన సదస్సులు, 10 గ్రామాల్లో పారా లీగల్ వాలంటీర్ల ద్వారా అవగాహనా కార్యక్రమాలు నిర్వహించినట్లు తెలిపారు. దూర ప్రాంతం నుంచి లోక్ అదాలత్‌కు రాలేని వారు బ్లూ జీన్స్ ద్వారా తమ కేసులను రాజీ చేసుకోవచ్చన్నారు.



వికసించిన మే పుష్పం

విరిసిన మే పుష్పం

ప్రజాశక్తి - మొగల్తూరు

మే పుష్పం వికసించింది. మండలంలోని పేరుపాలెం సౌత్‌కు చెందిన కారుమంచి రాజయ్య ఇంటి ఆవరణలో తూర్పుగోదావరి జిల్లా నుంచి తీసుకొచ్చిన మొక్క నాటారు. ప్రతి సంవత్సరమూ క్రమం తప్పకుండా మే నెలలోనే ఈ పుష్పం వికసిస్తుంది. శుక్రవారం ఈ పుష్పాన్ని చూసేందుకు పలువురు ఆసక్తి కనబర్చారు.